క్లుప్తంగా

ఎర్రమంచి సెక్రటరీకి ఉత్తమ అవార్డు



జేసీ చేతుల మీదుగా అవార్డు తీసుకొంటున్న జితేంద్రనాయక్

పెనుకొండ రూరల్: టీబీ వ్యాధి నివారణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన మండల పరిధిలోని ఎర్రమంచి పంచాయతీ సెక్రటరీ జితేంద్రనాయక్‌కు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఉత్తమ అవార్డు అందించారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో ఈమేరకు అవార్డు ప్రదానం చేశారు. జితేంద్రకు అవార్డు రావడం పట్ల పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

31న జ్యోతుల ఉత్సవం

సోమందేపల్లి: చౌడేశ్వరిదేవి పంచమ జ్యోతుల ఉత్సవాన్ని ఈ నెల31న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీ.సీ. ఈశ్వరయ్య తెలిపారు. ప్రతి ఏడాది తరహాలోనే ఈసారి కూడా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వేలాది మంది భక్తులు తరలివస్తారని, కాబట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ స్టేషన్‌లో సోమవారం అర్జీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు తిరుమల దేవరపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పరిగి: మండలంలోని ఎర్రగుంట పంచాయతీ తిరుమల దేవరపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఉదయం 6 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని కోరారు.

మహిళ ఆచూకీ లభ్యం



మంజులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన దృశ్యం

రొళ్ల: అదృశ్యమైన మంజుల అనే వివాహిత ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. సెల్‌ఫోన్ ద్వారా బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి ఆమెను మండలానికి తీసుకొచ్చి తహసీల్దార్ షేక్షావలి ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. అనంతరం మంజులను కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి వివరాలమేరకు.. మండలంలోని కేపీ తండాకు చెందిన శ్రీనివాసులు 13 ఏళ్ల క్రితం చిత్తూరు జిల్లా వి.కొత్తకోటకు చెందిన మంజులను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బెంగళూరులోనే ఉంటూ శ్రీనివాసులు సెంట్రిక్ పనిచేస్తుండగా, మంజుల బట్టల దుకాణంలో పనిచేసేవారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కేపీ తండాకు వారంతా వచ్చారు. అయితే ఆ తర్వాత మంజుల కనిపించకుండా పోవడంతో శ్రీనివాసులు పోలీసులను ఆశ్రయించాడు. తన భర్త శ్రీనివాసులు ప్రవర్తన సరిలేని కారణంగా అతని నుంచి దూరంగా బెంగళూరుకు వెళ్లిపోయినట్లు మంజుల అధికారులకు వెల్లడించింది. భర్త, పిల్లలతో కలిసి జీవించాలని అధికారులకు నచ్చజెప్పారు.

జాతీయ పురస్కారం అందుకున్న 'మలికజాన్'



గోరంట్ల: మండల కేంద్రానికి చెందిన ఇంగ్లిష్ టీచర్ 'మలికజాన్'కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య కళా విజ్ఞాన కేంద్రంలో 'సర్వేజనో సుఖినోభవంతు సంస్థ' తమ 8వ వార్షికోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ జాతీయ స్థాయి అవార్డులను ప్రకటించింది. అవార్డుల్లో భాగంగా గోరంట్ల పట్టణానికి చెందిన ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ఎస్.మలికజాన్‌ను ఎంపిక చేశారు. తెలంగాణ మానవ హక్కుల చైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

పెనుకొండ రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించాలని పెనుకొండ పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. పెనుకొండ చుట్టు ఉన్న కొండలకు రక్షణ కల్పించాలని కోరారు. ఇటీవల ఆకతాయి చేష్టల వల్ల అడవులు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అడవులను రక్షించేందుకు, పెంచేందుకు ఉపాధీ కూలీలను వినియోగించుకోవాలన్నారు. కొండల చుట్టు నిఘా నేత్రాలు, డ్రోన్ కెమెరాలు , ప్రమాదాలను గుర్తించేందుకు ఎత్తైన టవర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్లోరైడ్

మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాలను ఫ్లోరైడ్ భూతం పట్టిపీడిస్తోంది. కలుషిత నీటినే తాగుతూ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. స్వచ్ఛ నీటిని అందిస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తవుతున్నా పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో కలుషిత నీటిని తాగలేక గ్రామీణ ప్రజలు అల్లాడిపోతున్నారు.



మల్లినమడుగులో నిరుపయోగంగా ఉన్న ఎన్‌టీఆర్ సృజల స్రవంతి వాటర్ ప్లాంట్

- మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ఫ్లోరైడ్ నీరే గతి
- స్వచ్ఛజలానికి నోచుకోని గ్రామీణులు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎం.రాయాపురంలో చిన్నవయస్సులోనే అవయవ లోపంతో మంచానికే పరిమితం అయిన నందిని

రొళ్ల: మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామీణులు ఫ్లోరైడ్ సమస్య కారణంగా ప్రజలు అవయవ లోపాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా నీటిని శుద్ధిని చేసే డీఫ్లోరిడేషన్ ప్లాంట్లను ప్రభుత్వం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న నీటిని తాగి 30 నుంచి 35 ఏళ్లకే అవయవ లోపాల కారణంగా వ్యాధులకు గురై మంచానికే పరిమితమవుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో ఐదు మండలాల్లో మొత్తం 59,149 కుటుంబాలు, మొత్తం 2,65,825 మంది జనాభా ఉంది. రొళ్ల మండలంలో వెంకటంపల్లి, సీఎం ఘట్ట, రంగనపల్లి, సోమఘట్ట, మడకశిర మండలంలో హెచ్‌ఆర్ పాళ్యం, ఆమిదాలగొంది, బుళ్లసముద్రం, కల్లుమర్రి, గుడిబండ మండలంలో రాళ్లపల్లి, సంకరగల్లు, అగళి, అమరాపురం మండలంలో తదితర గ్రామాల్లో కూడా తాగునీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పత్తాలేని ఎన్‌టీఆర్ సృజల స్రవంతి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ రూ.2కే 20 లీటర్ల ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందిస్తామని ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావసున్నా మంచినీటి సరఫరా ఊసేలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదారు ప్లాంట్లు మినహా ఎక్కడా పథకం అమలుకు నోచుకోవడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. పలుసార్లు ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఫ్లోరైడ్ ఉన్నట్లు ధ్రువీకరించినా డీఫ్లోరిడేషన్ ప్లాంట్లు నిర్మించకపోగా శుద్ధ జలాల పథకాల ఏర్పాటులోనూ ప్రభుత్వం విఫలమైందని వాపోతున్నారు.

1.5 శాతానికి మించి..

తాగునీటిలో సాధారణంగా 1.5 పీపీఎం మాత్రమే ఫ్లోరైడ్ శాతం ఉండాలి. అంతకంటే ఎక్కువగా ఉంటే ఆ నీటిని తాగకూడదని వైద్యులు సూచిస్తున్నారు. కాగా 75 శాతం గ్రామాల్లో అంతకంటే ఎక్కువగా నీటిలో ఫ్లోరైడ్ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నా కూటమి ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. రొళ్ల మండలంలోని వెంకటంపల్లిలో 3.8 శాతం, రంగనపల్లిలో 3.10, మల్లినమడుగులో 2.6, సీఎం ఘట్టలో 2.8, సోమఘట్టలో 3.1, మడకశిర మండలంలో హెచ్‌ఆర్ పాళ్యంలో 2.9 శాతం, ఆమిదాలగొందిలో 3.5, బుల్లసముద్రంలో 2.10, కల్లుమర్రిలో 3.4, గుడిబండ మండలంలో రాళ్లపల్లిలో 3.1 శాతం, సంకరగల్లులో 2.6 శాతంతో పాటు అగళి, అమరాపురం మండలాల్లో కూడా ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో ప్రజలు వివిధ జబ్బులతో సతమతమవుతున్నారు.

ప్రజల బాధలు పట్టని ప్రభుత్వం

ఫ్లోరైడ్ ఎక్కువ ఉన్న గ్రామాల్లో ఎన్‌టీఆర్ సృజల స్రవంతి మంచినీటి పథకాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నా అధికారులు, పాలకులు స్పందించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. గ్రామాల్లో ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలనే సంకల్పంతో ప్రవేశ పెట్టిన శ్రీరామిరెడ్డి మంచినీటి పథకం నీరు చాలా గ్రామాలకు చేరడం లేదు. చేరినా కూడా వారం పది రోజులకోసారి శ్రీరామిరెడ్డి మంచి నీటిని వదులుతున్న పరిస్థితి. ఆర్డీటీ తరపున అగళి మండలంలో మధూడి, రొళ్ల మండలంలో రొళ్ల, కె.బ్యాడిగెర, అలుపనపల్లి, అమరాపురం మండలంలో బసవనపల్లి, అగ్రహారం, మడకశిర మండలంలో బుల్లసముద్రం, గుడిబండ మండల కేంద్రంలో శుద్ధ జల మంచినీటి పథకం ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించినా మంచినీరు మాత్రం ప్రజలకు సక్రమంగా చేరడం లేదు.

మడకశిర నియోజకవర్గ జనాభా	
మండలం	జనాభా సంఖ్య
అగళి	36,253
రొళ్ల	39,964
గుడిబండ	52,610
అమరాపురం	55,771
మడకశిర	81,227

రోగాల బారిన పడుతున్నాం



ఫ్లోరైడ్ లేని మంచినీటిని ప్రభుత్వం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఫ్లోరైడ్ నీటిని తాగుతుండటంతో 30 నుంచి 35 ఏళ్ల వయస్సుల వారికి కీళ్లు, ఒళ్లునొప్పులు వస్తున్నాయి. డాక్టర్ల దగ్గరకు వెళితే ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్లే ఇలా కాళ్ల నొప్పులు, ఒళ్లునొప్పు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని గ్రామాల్లో శుద్ధజల నీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి మంచి నీరు అందించాలి.

– దయానంద్, సోమఘట్ట, రొళ్ల మండలం

హామీ నిలబెట్టుకోరా?



గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలోనూ శుద్ధజల మంచినీటి పథకం ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా ప్రతి ఇంటికీ రూ.2కే 20 లీటర్లు శుద్ధజలాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఐదు మండలాల్లో కనీసం ఐదు శుద్ధజల పథకాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

– లోకేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

ఫ్లోరైడ్ రహిత నీరు అందిస్తాం

నియోజకవర్గం వ్యాప్తంగా ఎన్‌టీఆర్ సృజల స్రవంతి, ఆర్‌డీటీ వాటర్ ప్లాంట్‌తో పాటు శ్రీరామిరెడ్డి రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా కానున్న మంచినీటిని ఫిల్టర్ చేసి ఫ్లోరైడ్ రహిత నీటిని ప్రజలకు అందిస్తాం. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమన్వయం చేసుకుని సక్రమంగా ప్రజలకు నీటిని అందించడానికి చర్యలు తీసుకుంటాం . ప్రజలు కూడా ఫ్లోరైడ్ రహిత నీటిని ఉపయోగించుకోవాలి.

– మనునాయక్, డీఈ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, మడకశిర డివిజన్

సంక్షిప్త సమాచారం

డీటీగా మారుతీ ప్రకాష్

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా మారుతీ ప్రకాష్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ముద్దాయికి నెల రోజుల జైలు

మడకశిర: పట్టణంలోని సదాశివపురంలో 2021 మే నెలలో జరిగిన ఘర్షణ కేసులో ముద్దాయికి నెల రోజుల జైలు శిక్ష , రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఆస్తి విషయంలో విజయ్‌కుమార్, శేఖర్‌బాబు మధ్య ఘర్షణ జరిగిందన్నారు. విజయ్‌కుమార్‌కు రక్తగాయాలయ్యాయని, ఈ ఘటనపై మడకశిర పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. నేరం రుజువు కావడంతో శేఖర్‌బాబుకు జైలు శిక్ష పడిందని పేర్కొన్నారు.

సమస్యలపై పది అర్జీల స్వీకరణ

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యలపై పది అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అర్జీలను స్వీకరించినట్లు పేర్కొన్నారు.

400 మందికి అన్నదానం

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి నిర్వహిస్తున్న నిత్య అన్నసంతర్పణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రైల్వేరోడ్డులో 400 మందికి అన్నదానం చేశారు. నిత్య అన్నదానంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించామని నిర్వాహకులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి జలధి ఉత్సవం

మడకశిర: పట్టణంలోని వడ్రపాళ్యంలో సోమవారం వేంకటేశ్వరస్వామికి జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు.

ప్రతిపాదనలు పంపండి

మడకశిర: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పీఆర్ పరిధిలో పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని స్థానిక పీఆర్ డీఈ వెంకటేశులు కోరారు. సోమవారం పీఆర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. పీఆర్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల పై చర్చించారు.


జిమ్ ఏర్పాటుకు భూమి పూజ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగంణంలో జిమ్ ఏర్పాటుకు మంత్రి సవిత భూమి సోమవారం భూమి పూజ చేశారు. క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

భూ రీసర్వేపై అవగాహన

అమరాపురం: గ్రామాల్లోని రైతులు భూ సర్వేపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నిడ్రగట్ట గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూములను రీ సర్వే చేసుకునే వారు ఎలాంటి సర్వే ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



తిమ్మక్క (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలోని శంకరగల్లుకు చెందిన తిమ్మక్క (104) సోమవారం మృతి చెందింది. గతంలోనే ఆమె భర్త హనుమంతరాయప్ప చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శంకరగల్లకు చేరుకొని తిమ్మక్క భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

నిబంధనలు పాటించాలి

పెనుకొండ రూరల్: మద్యం షాపు యజమానులు నిబంధనలు తప్పక పాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. పెనుకొండ సర్కిల్ పరిధిలోని 14 మద్యం దుకాణ యజమానులతో సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని సూచించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు సోమవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎస్‌ఎంయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కొన్ని నెలల నుండి కోరుతున్నా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. కార్మికులపై అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని కోరినా ఫలితం లేకపోవడం దారుణమన్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు తమ డిమాండ్లపై స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు ముద్దప్ప, పురుషోత్తం, రంగనాథ్, నాయక్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

హనీట్రాప్‌లో మరికొందరు బాధితులు

- పరువు పోతుందని పోలీసులకు ఫిర్యాదు చేయని వైనం
- బాధితులకు ఫోన్లు చేస్తున్న ఖాకీలు



లేపాక్షి: మండలంలో వెలుగులోకి వచ్చిన హనీట్రాప్ వ్యవహారం జిల్లాలోనే సంచలనంగా మారింది. కొండూరుకు చెందిన హనీట్రాప్ ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వలపు వల ఉచ్చులో పలువురు ప్రభుత్వ అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు చిక్కుకున్నట్లు తెలిసింది. ఎంతోమంది బాధితులు ఉన్నప్పటీ ఒక్క ఫిర్యాదుదారుడు మాత్రమే తనకు జరిగిన మోసాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. అయితే నిందితుల ఫోన్ల ద్వారా విచారణ చేపట్టిన పోలీసులకు మరిన్ని నిజాలు తెలిసినట్లు సమాచారం. కేవలం ఒక్కఫోన్‌లోనే దాదాపు 40 మంది బాధితుల వివరాలు దొరికాయంటున్నారు. ఇప్పటికే చాలా మందిని ఫోన్ ద్వారా సంప్రదించినట్లు తెలిసింది. అయితే తమ వివరాలు బయటకు తెలిస్తే ఎక్కడ తమ పరువుపోతుందోనని బాధితులు ఎవరూ తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవడం లేదని సమాచారం. హనీట్రాప్ వ్యవహారంలో బాధితులు ఎవరైనా తమకు జరిగిన అన్యాయాన్ని తమ దృష్టికి తీసుకొస్తే ఆ విషయంను గోప్యంగా ఉంచడంతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

భూసేకరణ చేస్తే ఆత్మహత్యలే శరణ్యం



ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి, తురుకువాండ్లపల్లి, జమ్మానిపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా ప్రస్తుతం చేపట్టిన భూసేకరణ నిలిపేయాలని రైతులు జిల్లా, డివిజన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రైతులు పెద్ద ఎత్తున పుట్టపర్తిలో కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో భూ సేకరణ నిలుపుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా డీఆర్‌ఓకు రైతులు కష్టాలను వివరించి భూ సేకరణ విరమించుకోవాలని వేడుకున్నారు. అదే విధంగా పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. ఒక వేళ రైతుల కష్టాలను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం భూసేకరణ చేస్తే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, తమ బాధ అర్థం చేసుకోవాలన్నారు.

రూ. 13.86 కోట్లకు బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్

పెనుకొండ: పట్టణంలో కుక్కలను నియంత్రించి ప్రజలను కాపాడాలని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బడ్జెట్‌తో పాటు సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ రోడ్డు పక్కన వేసిన పెట్టెలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని, లేకపోతే దుకాణాలకు వేసే విధంగా పన్ను వసూలు చేయాలన్నారు. దీనివల్ల వాహనరాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కమిషనర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా ఇళ్లు నిర్మించుకుని ఉంటే వాటికి తగిన రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అనంతరం 2025–26 సంవత్సరానికి వివిధ పనులకు రూ.13.86 కోట్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బోయ సునీల్, కోఆప్షన్ మెంబర్ నేమతుల్లా, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో వ్యక్తి మృతదేహం

హిందూపురం: మండలంలోని కగ్గల్లు గ్రామ సమీపంలో ఉన్న చెరువు ముళ్ల పొదల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. సమాచారం అందుకున్న హిందూపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 50 ఏళ్ల వయసున్న పురుషుడి మృతదేహంపై ఎలాంటి అనుమానిత గాయాలు కనిపించలేదు. నాలుగు రోజుల క్రితం అక్కడ పడుకుని మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	35.0
పెనుకొండ	37.0
మడకశిర	35.0

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అశ్వత్థనారాయణ



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన న్యాయవాదులు

మడకశిర: మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన న్యాయవాది అశ్వత్థనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా క్రిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్‌చంద్ర, సంయుక్త కార్యదర్శిగా దివాకర్, కోశాధికారులుగా నాగరాజు, అభిజిత్, లైబ్రేరియన్, కంప్యూటర్ ఇన్‌చార్జ్‌గా రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు సన్మానించారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: స్థానిక జీఆర్పీ పరిధిలోని కొట్నూరు సమీపంలో సోమవారం రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మురళి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆత్మహత్య చేసుకొన్నాడా? లేక రైలు ఢీకొని మృతి చెందాడా? అనే కోణంలో విచారణ చేపట్టారు.

దిగుబడి ఫుల్.. లాభాలు నిల్



ఏపుగా పెరిగిన అరటి తోట



విరగ్గాసిన అరటి గెలలు

- ధర పతనంతో నష్టాల్లో అరటి రైతులు

రొద్దం: అరటి ధరలు పతనం కావడంతో రైతులు నష్టాలబారిన పడుతున్నారు. మండల పరిధిలోని ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన రైతు రాజగోపాల్ నాయుడు 10 ఎకరాల్లో అరటి సాగు చేశాడు. జీ–9 రకం పెట్టాడు. ఎరువులు, విత్తనం, సేద్యం తదితర ఖర్చులకు భారీగా పెట్టుబడి పెట్టాడు. ఎకరాకు రూ. 3 లక్షల చొప్పున రూ. 30 లక్షలు ఖర్చుపెట్టాడు. దిగుబడి మాత్రం బాగా వచ్చింది. ఒక్కో గెల 40 నుంచి 45 కేజీలు దిగుబడి వచ్చింది. అయితే 20 రోజుల క్రితం ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పతనం కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ అరటి రూ.16 నుంచి రూ.10కి పడిపోయింది. ఇప్పటికే 80 టన్నులు రూ.16తో విక్రయించాడు. తాజాగా ఇప్పుడు మార్కెట్‌లో కేజీ అరటి రూ.10 నుంచి రూ. 9కి ధర పతనం కావడంతో రైతు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. నియోజకవర్గంలో అక్కడక్కడా అరటి సాగు చేసిన రైతులు కూడా నష్టాల బారిన పడటంతో లబోదిబోమంటున్నారు.

పెట్టుబడి కూడా రాదు

లక్షలు ఖర్చు పెట్టి పది ఎకరాల్లో అరటి పంటను సాగు చేశాను. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించడంతో దిగుబడులు బాగా వచ్చాయి. ధర కూడా 20 రోజుల ముందు బాగుండటంతో ఈసారి సమస్యల నుంచి గట్టెక్కుతామని ఆశించాం. తీరా కోత దశకు వచ్చేసరికి ధర అమాంతంగా తగ్గిపోయింది. ప్రస్తుతం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– రాజగోపాల్‌నాయుడు, ఆర్ కొట్టాల